క్లుప్తంగా

7న స్కూల్ గేమ్ సెలక్షన్స్

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ 7వ తేదీన స్థానిక కేవీ ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో డి.రవీంద్ర, పీడీ వి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగంలో ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన పాఠశాలల క్రీడాకారులు బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షెటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో హాజరుకావాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మక్కపేట(వత్సవాయి): ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని గోపినేని పాలెం రహదారిలో బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు చుట్టపక్కల చెత్తాచెదారాలు అక్కడకు వచ్చి చేరుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నిలిచిపోయింది. మురుగు ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో నీరు చుట్టూ నిలబడిపోతోంది. దీంతో స్థానికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న చెత్తను తొలగించి మురుగు వెళ్లే మార్గం చూపాలని.. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరింత ఎత్తులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నదాన పథకానికి భక్తుల విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో కొలువైన వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు రూ.55,232లు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ఎన్.వి.సాంబశివరావు శనివారం పేర్కొన్నారు. హైదరాబాద్, జగ్గయ్యపేట ప్రాంతాలకు చెందిన గుప్త ప్రభాకర్, వెంకట సుబ్బారావు రూ.25,116 చొప్పున విరాళాలు అందజేశారని ఆయన వివరించారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయాలి



మైలవరం: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మైలవరం మండల విద్యాశాఖ కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధన, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిలు తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులను నేడు ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలను అమలు చేసే వారిగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పురుషుల భాగస్వామ్యంపై బైక్ ర్యాలీ



పెనమలూరు:కుటుంబంలో పురుషుల భాగస్వామ్యం పై అవగాహన కల్పించటానికి వణుకూరు గ్రామంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో 4వ అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. కుటుంబంలో పురుష భాగస్వామ్యం, డిజిటలీకరణతో కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వై.రమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, పురుషులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

బంగారు నాణెం అందజేత

చాట్రాయి: విజయ కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకాన్ని శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని యర్రవారిగూడెం పాల సంఘంలో పాలు పోస్తున్న బొల్లినేని సర్వేశ్వరరావు కుమారుడు ఏసుబాబు, ఎర్రా వెంకట పుల్లారావు కుమార్తె సౌజన్యల వివాహం సందర్భంగా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే బంగారు నాణాన్ని పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు అందజేశారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

పెనుగంచిప్రోలు: మండలంలోని దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని మునేరులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలానే గ్రామంలోని బీసీ కాలనీ, తూర్పు బజారులో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు అనంతరం భక్తుల జయజయ ధ్వనుల నడుమ మునేరుకు తరలించారు.

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాలలో ఏర్పాటుచేసిన అమ్మవార్ల విగ్రహాలకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. వత్సవాయి, మక్కపేట, భీమవరం గ్రామాలలోని విగ్రహాలకు శుక్రవారం పూజలు ముగిశాక రాత్రి అమ్మవారి ప్రతిమలను కదిలించి శనివారం గ్రామోత్సవాలు నిర్వహించారు. వాహనాలపై అమ్మవారిని డప్పు వాయిద్యాలు, బాణాసంచాతో గ్రామోత్సవం చేశారు. నిమజ్జనాల కోసం జగ్గయ్యపేట మండలం వేదాద్రి వద్ద కృష్ణానదికి విగ్రహాలను తరలించారు.

నందిగామ రూరల్: అమ్మవారి విగ్రహాలకు శనివారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పందిళ్లలో కొలువుదీరిన అమ్మవారిని ప్రత్యేక వాహనాలపై ఉంచి కోలాట ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ వైభవంగా ఊరేగింపుగా కంచికచర్ల మండలం కీసర గ్రామంలోని మునేటికి, వేదాద్రి కృష్ణానదికి తరలించారు. ఆయా కార్యక్రమాలలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



తిరుపతమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం

ముగిసిన బతుకమ్మ సంబరాలు

పెనుగంచిప్రోలు: బతుకమ్మ సంబరాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. పెనుగంచిప్రోలు శ్రీఅంబికేశ్వరస్వామి ఆలయం, శ్రీధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, టౌన్ సెంటర్ వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మలను రంగు రంగుల పూలు, ఆకులతో తయారు చేసి గ్రామంలో ఆట, పాటల మధ్య మునేరులో నిమజ్జనం చేశారు. అలానే ముండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.



మక్కపేట శ్రీ గణేష్‌కృష్ణ యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం



నందిగామలో అమ్మవారి ఊరేగింపు

ఖైదీలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ గోపి

నందిగామ రూరల్: ఖైదీలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జి.గోపి పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. ఖైదీలు న్యాయవాదులను నియమించుకునే స్తోమత లేకపోతే మండల లీగల్ కమిటీ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఖైదీల వసతులు, ఏ కేసులో వచ్చారో బెయిల్ వివరాలను ఆయన జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రామకృష్ణ, 16వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి వి.సత్యలక్ష్మీ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.వందన, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నంద్రు బాబు విద్యాసాగర్, అద్దంకి మణిబాబు, జైలు సూపరింటెండెంట్ చదల శ్రీనివాసరావు, లీగల్ ఎయిడ్ న్యాయవాది షేక్ ఆజాద్, కోర్టు సిబ్బంది గంగా జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం:స్థానిక సబ్‌జైలును శనివారం జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. గోపి సందర్శించారు. తొలుత సబ్‌జైలులోని సదుపాయాలను, ఖైదీల బ్యారక్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జేవీ కృష్ణయ్య, మండల చైర్మన్, సబ్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. గాయత్రి, సబ్‌జైలు సూపరింటెండెంట్ రాంబాబు, పానల్ లాయర్, పలువురు కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో నందిగామ సబ్‌కోర్టు జడ్జి



పెనుగంచిప్రోలు: గ్రామంలో కొలువైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని శనివారం నందిగామ సబ్‌కోర్టు జడ్జి సత్య లక్ష్మీ ప్రసన్న దర్శించుకున్నారు. అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆమెను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

ఓట్ల చోరీతో గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

వీరులపాడు: ప్రధాని మోదీ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘంతో ఏకమై లేని ఓటర్లను చేర్చి ఈవీఎంలను అడ్డంపెట్టుకుని ఎన్నికల్లో గెలిచిందని నందిగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందా వజ్రయ్య ఎద్దేవా చేశారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మోదీకి వ్యతిరేకంగా కరపత్రాలను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వజ్రయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో జతకట్టి ఎన్నికల్లో గెలిచిందని, రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట గోపాలరావు, కొఠారు రవికుమార్, చిట్లూరి ప్రభావతి, సూదుల పూర్ణచంద్రరావు, వేల్పుల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

మైలవరం: మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీలో విష జ్వరాలు ప్రబలకుండా శనివారం దోమల నివారణ మందు పిచికారి చేయించినట్లు సర్పంచ్ కోటమ్మ తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగా తెలియజేయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే తాతయ్య చెక్కుల అందజేత

జగ్గయ్యపేట అర్బన్: వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాగా విశిష్ట అతిథిగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర విచ్చేశారు. ముందుగా విజయవాడలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆటో డ్రైవర్ల సేవలో' మహా కార్యక్రమానికి హాజరు కానున్న ఆటో డ్రైవర్లు, వాహన మిత్రాలు తరలి వెళుతున్న బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తాతయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు 2002 మందికి గానూ రూ.3,00,30,000ల లబ్ధి చేకూరిందని తెలిపారు. సంబంధిత చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పేటలోని మార్కెట్ యార్డులో ఆటో డ్రైవర్లతో ఎమ్మెల్యే తాతయ్య

ముగిసిన ఉచిత వైద్య సేవలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి దిగువునగల కనకదుర్గానగర్, పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటలపాటు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించామని తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ 12 రోజుల్లో సుమారు 50 వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అలాగే ఫిజికెమ్ ఫౌండేషన్ అధినేత సీసీ కేశవరావు రథం సెంటర్‌లో ప్రసాదాల పంపిణీకి సహకరించారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించిన డాక్టర్ కోలా విజయ శేఖర్ వైద్య బృందానికి, మందులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులకు కృతజ్ఞతలు తెలియ చేశారు.



భవానీ భక్తురాలికి మందులు అందచేస్తున్న క్లబ్ సభ్యులు

వన్‌టౌన్ పీఎస్‌లో వైభవంగా చండీ హోమం

- పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికిన సీపీ రాజశేఖరబాబు
- పోలీసు అధికారులకు, పేదలకు అన్నదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో చండీ హోమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, పలువురు ఐపీఎస్ అధికారులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే మహార్నవమి రోజున ఆయుధ పూజలు కూడా వైభవంగా నిర్వహించారు. విజయ దశమి రోజున సాక్షాత్ దుర్గమ్మ ఇంద్రకీలాద్రి కొండ దిగి పోలీసుస్టేషన్‌కు వచ్చి పూజలందుకొని తిరిగి వెళ్లింది. అటువంటి పలు కార్యక్రమాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు స్టేషన్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. పోలీసు కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎన్.దుర్గారావు పర్యవేక్షించారు.

ఉత్సవాలను విజయవంతం చేశాం..

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు అన్నారు. వన్‌టౌన్ స్టేషన్ ప్రాంగణంలో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. అధికారులందరూ కలిసికట్టుగా ఉత్సవాలను చక్కగా నిర్వహించారని కొనియాడారు. దసరా వేడుకలకు 16 లక్షల మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. 13 రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. వేలాది మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు.



అన్నదానం ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్



చండీహోమం నిర్వహిస్తున్న సీఐ గురుప్రకాష్

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నెముక

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని జగ్గయ్యపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. శనివారం గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నం శ్రీనివాసరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడిగా పిడికిటి కోటేశ్వరరావులను ఎంపిక చేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదవులు పొందిన నాయకులు కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నంబూరి రవి, ప్రచార విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కనకపూడి భాస్కరరావు, ఐటీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ లతీఫ్ పాషా, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు బండి రంజిత్‌కుమార్, గ్రామ నాయకులు వూట్ల లక్ష్మయ్య, కోలా రామారావు, గింజుపల్లి శ్రీనివాసరావు, వెంకట రామయ్య, కోటేశ్వరరావు, పాలాది వెంకట రమణ, గరిడి హనుమంతరావు, చెరుకుమల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సత్కార కార్యక్రమంలో పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫ్యాప్టో ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల ఫ్యాప్టో కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ, ఆర్థిక రంగ సమస్యల సాధన కోసం తలపెట్టిన ధర్నా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా నేటికీ పీఆర్సీ కమిటీని వేయలేదని, కనీసం ఐఆర్ కూడా ప్రకటించలేదని అన్నారు. టీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. నాలుగు డీఏలు, పీఆర్సీ అరియర్లు, సరెండర్ లీవు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అల్లిక నరసింహారావు, జె.సుధానంద్, జి.రవికుమార్, జి.పల్లవి, కె.రాజేంద్ర, పి.ఆనంద్, జి.ముక్తేశ్వరరావు, ఎల్ఎండీ నాయక్, కె.రామాంజనేయులు, పి.వెంకటేశ్వర్లు, సీహెచ్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరో బాలిక మృతి

అక్రమ ఇసుక దందా
గోతులకు బలైన అమాయకపు కీర్తన

కంచికచర్ల: వేములపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లు జనవాసాల ప్రాంతాలకు దగ్గరగా ఉన్నాయని.. అందుకే మునేరులో బాలిక పడి మృతి చెందిందని బీఎస్పీ ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్ కిరణ్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఇసుక రీచ్‌లు వద్దని అనేక సార్లు ప్రజలు అధికారులకు గతంలో విన్నవించారని.. వాటిని అధికారులు విస్మరించి అనుమతులు ఇచ్చారని అన్నారు. డబ్బే ప్రధానంగా కాకుండా ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా కళ్లు తెరిచి గ్రామంలో ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని తెలిపారు. మునేరులో పడి మృతి చెందిన రెండో తరగతి చదువుతున్న కీర్తన కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు.



బహిరంగ లేఖతో ఉదయ్ కిరణ్

అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 9 నెలలు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబేడ్కర్ స్మృతివనం మెయిన్ గేటు వద్ద భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల నిరసన భిక్షాటనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్లు, హక్కుల సాధన కోసం శాంతియుతంగా చేస్తున్న నిరసనను అడ్డుకోవటం అన్యాయమన్నారు. అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అధికారులు, కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.



భిక్షాటన చేస్తున్న కార్మికులు

దుర్గ గుడి పాలకమండలి నుంచి పార్వతిని తొలగించాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంటిబాబు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో అతి పెద్ద రెండో దేవస్థానమైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పాలకమండలి బోర్డ్ డైరెక్టర్‌గా నియమితురాలైన తరిగొప్పుల పార్వతిని తక్షణమే తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాదిలి చంటిబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్వతిని బోర్డ్ డైరెక్టర్‌గా నామినేట్ చేసిన కూటమి ప్రభుత్వానికి ఆమె కోడలి హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చిన సంగతి తెలియదా అని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జగ్గయ్యపేటకు చెందిన జెడ్పీటీసీ సభ్యురాలి కారును వేరే వ్యక్తి తీసుకువెళ్లగా అందులో తెలంగాణా మద్యం ఉందని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో దుర్గ గుడి పాలకమండలి సభ్యురాలిగా ఆమెను వెంటనే తొలగించారని గుర్తు చేశారు. మరి హత్య కేసులో 90 రోజులు జైలు జీవితం గడిపిన తరువాత బెయిల్‌పై ఉన్న పార్వతిని ప్రతిష్టాత్మకమైన దుర్గమ్మ గుడిలో ఎలా నియమించారని ప్రశ్నించారు. జగన్మాత కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్టను, భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని వెంటనే పార్వతిని తొలగించాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మహాలక్ష్మి సన్నిధిలో అన్నప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేలాది మందికి అన్నదానం చేశారు. తొలుత ఆహార పదార్థాలకు ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ పూజలు నిర్వహించారు. అనంతరం 11 మంది ముత్తైదువులను అమ్మవారి ప్రతిరూపాలుగా భావించి వారికి అన్న ప్రసాదాన్ని అందచేసిన అనంతరం భక్తులకు, అమ్మవారి సేవకులకు ప్రసాద వితరణ జరిగింది. కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున భక్తులు, చిట్టినగర్ వాసులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, కామందుల నరసింహరావు, పోతిన సాంబశివరావు, పిళ్లా విజయ్‌కుమార్, బంక హనుమంతరావు పర్యవేక్షించారు.